# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ రికార్డులను ఆధునికీకరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
2. **యువత వ్యవసాయ విద్యను అభ్యసించడమే కాకుండా పంటల సాగుకు ముందుకురావాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు.**
3. **విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈరోజు నుంచి భవానీ దీక్షల విరమణ కార్యక్రమం ప్రారంభమైంది.**
4. **తెలంగాణలో భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి' బిల్లును ప్రభుత్వం తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
5. **ఈరోజు తొలి అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==============================

ఆంధ్రప్రదేశ్‌లో భూముల రీసర్వేని నిర్వహించి, రెవెన్యూ రికార్డులను ఆధునికీకరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణాజిల్లా పర్యటనలో భాగంగా ఈడుపుగల్లులో నిన్న నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భూ సమస్యలను పరిష్కరించి, వాటిని తిరిగి హక్కుదారులకు అప్పగిస్తామని చెప్పారు భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని చంద్రబాబు నాయుడు తెలుపుతూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

యువత వ్యవసాయ విద్యను అభ్యసించడమే కాకుండా పంటల సాగుకు ముందుకురావాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి అధునాతన పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో విస్తృతంగా వినియోగించాలన్నారు. వ్యవసాయ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, వాతావరణ మార్పులు వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ముందడుగు వేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ సూచించారు.

---------------------------

విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ రోజు నుంచి భవానీ దీక్షల విరమణ కార్యక్రమం ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి లక్షలాదిగా అమ్మవారికి ఇరుముడి సమర్పించి మాల విరమించనున్నారు. దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భవానీ దీక్ష 2024 పేరుతో ప్రత్యేక యాప్‌ను దేవాదాయశాఖ, ఇప్పటికే ఆవిష్కరించింది. ఈ ఐదు రోజులపాటు అన్ని క్యూ లైన్‌ల ద్వారా భక్తులు ఉచితంగానే అమ్మవారి దర్శనం చేసుకోవచ్చని, అలాగే అంతరాలయ దర్శనాలను సైతం రద్దు చేశామని ఆలయ అధికారులు తెలిపారు. దీక్షల విరమణ కార్యక్రమం ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతుంది.

---------------------------

తెలంగాణలో భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి' బిల్లును ప్రభుత్వం తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా భూ భారతి బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రతి సమస్య భూమితోనే ముడిపడి ఉందని చెప్పారు. రైతుల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని తెలుపుతూ..

వాయిస్ .... 20 సెకన్లు

కాగా ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం భూ భారతి బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసు, జైళ్లు, న్యాయశాఖలోని ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌తో కలిసి ఫాస్ట్‌ట్రాక్, ప్రత్యేక కోర్టులలో ఉన్న కేసులు, వాటి పనితీరు, పురోగతిపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని శాఖలు సమర్థంగా పనిచేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. 'ప్రత్యేక, ఫాస్ట్‌ట్రాక్, న్యాయ స్థానాల్లో మహిళలకు సత్వర న్యాయం అందించేలా వ్యవస్థలను మరింత పటిష్టం చేస్తామని చెప్పారు. తక్కువ వ్యయంతో వేగంగా న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ముగింపు సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యతోపాటు వైద్యానికి సమానంగా నిధులు కేటాయించామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు నూతన సాంకేతికత ద్వారా వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఈ రోజు తొలి అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ధ్యానం ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్న లక్ష్యంతో డిసెంబరు 21ని 'అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ ధ్యాన దినోత్సవాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఈరోజుని నిర్వహిస్తున్నారు. ధ్యానం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీవితంలో, సమాజంలో పెరుగుతున్న ఒత్తిళ్లు, హింస వంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం మార్గంగా ధ్యానం ఉపయోగపడుతుంది. ధ్యానం మానసిక

ఒత్తిడిని దూరం చేస్తుంది. రోగనిరోధక శక్తిని అనేక రెట్లు పెంచుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలన్నదే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో 'మెగా జాబ్ మేళా' ను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ...39 సెకన్లు

---------------------------

తెలంగాణలోని 194 ఆదర్శ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 23న నోటిఫికేషన్ జారీ చేస్తామని, వచ్చే ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఆదర్శ పాఠశాల అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి తెలిపారు. 6వ తరగతిలో అన్ని సీట్లకు ప్రవేశాలు ఉంటాయని, ఏడు నుంచి పదవ తరగతి వరకు మాత్రం ఖాళీలు ఉంటే భర్తీ చేస్తామని పేర్కొన్నారు. www.telanganams.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

---------------------------

విద్యార్థులలో పరీక్షల ఒత్తిడిని తగ్గించే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముచ్చటించే "పరీక్షా పే చర్చ" కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమైంది. ఢిల్లీలోని భారత మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి my gov.in వెబ్‌సైట్‌లో విద్యార్థులు వచ్చే జనవరి 14 వ తేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడి తగ్గి విద్యార్థులు అద్భుత విజయాలు సాధించేలా చేయడం కోసం ప్రధాన మంత్రి వారితో సంభాషించి వారిలో మనోధైర్యాన్ని కల్పిస్తారు. ఆరు నుండి పన్నెండు తరగతుల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. గత ఏడాది జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 2 కోట్ల 26 లక్షల మంది పాల్గొన్నారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================